క్లుప్తంగా

ఢిల్లీలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



జనగామ: ఢిల్లీలో బీఆర్‌ఎస్ పార్టీ జాతీయ కార్యాలయ ప్రారంభోత్సవంలో గురువారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధన కోసం ఆవిర్భవించిన టీఆర్‌ఎస్ గల్లీ నుంచి ఢిల్లీలో బీఆర్‌ఎస్‌గా ఉద్భవించి రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఖాజా ఆరిఫ్‌తోపాటు తదితరులు ఉన్నారు.

అనాథకు అండగా..



నర్మెట: మండలంలోని లోక్యతండాకు చెందిన భూక్య బాలు రేణుకలు ఏడేళ్ల క్రితం చనిపోవడంతో వారి సంతానం వెంకన్న, సుమిత్ర నా అన్నవారులేక అనాథలుగా మిగిలారు. కాగా, మృతుడు బాలుకు చెందిన 25 గుంటల వ్యవసాయ భూమి సైతం వేరొకరి పేరున నమోదు కావడంతో గతకొంత కాలంగా వివాదం నెలకొంది. ఈ క్రమంలో సర్పంచ్ లకావత్ కిరణ్, బీఆర్‌ఎస్ ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి చొరవతో సమస్య పరిష్కారమైంది. దీంతో గురువారం తన సొంత ఖర్చుల (రూ.12,500)తో పెద్ది రాజిరెడ్డి సదరు భూమిని భూక్య వెంకన్న పేరున రిజిస్ట్రేషన్ చేయించారు. రఘునాథ్‌పల్లి కేజీబీవీలో సుమిత్ర 10వ తరగతి పూర్తి చేయగా, జనగామ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వెంకన్న ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తి చేశాడు. లకావత్ కిరణ్, పెద్ది రాజిరెడ్డి, కారోబార్ రమేష్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాక్టర్.. బైక్ ఢీ
ఇద్దరికి తీవ్ర గాయాలు




ఘటనా స్థలంలో క్షతగాత్రులు

చిల్పూరు: ట్రాక్టర్–బైక్ ఢీకొన్న ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన రాజవరం సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ బంధువుల కథనం ప్రకారం..మండల కేంద్రంలోని చిల్పూరుగుట్టకు చెందిన రాపోలు ఎల్లయ్య కుమారుడి వివాహం బుధవారం హనుమకొండలో జరిగింది. ఈ కార్యక్రమానికి మడికొండ సమీపంలోని రొట్టబండకు చెందిన రాపోలు హనుమంతు, రాపోలు రాంబాబు ఉదయం బైక్‌పై వచ్చారు. విందు ఏర్పాట్లు పూర్తిచేసి మడికొండలో అత్యవసర పని కోసం వెళ్తుండగా రాజవరం సమీపం ట్రాన్స్‌కో సబ్ స్టేషన్ దగ్గర అక్కంపేట మండలం గొల్లకుంటకు చెందిన మారపాక సమ్మయ్య ట్రాక్టర్ ఎదురుగా రావడంతో బైక్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరు ఎగిరిపడగా రాంబాబు తలపగిలి పరిస్థితి విషమంగా ఉంది. హనుమంతుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై చేరుకుని 108 వాహనానికి సమాచారం అందివ్వగా పైలట్ సంపత్, ఈఎస్‌టీ రాజేంద్రప్రసాద్ లు గాయపడ్డ వారిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు

రఘునాథపల్లి: మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వాహనదారుడికి జనగామ కోర్టు న్యాయమూర్తి వెంకటరామనర్సయ్య జైలు శిక్ష, జరిమానా విధించినట్లు జనగామ రూరల్ సీఐ సంతోష్ తెలిపారు. గురువారం సీఐ మాట్లాడుతూ రఘునాథపల్లిలో ఈ నెల 1న నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న గబ్బెట గ్రామానికి చెందిన చిట్యాల వెంకటేష్‌ను గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. గురువారం వెంకటేష్‌కు రెండు రోజుల జైలు శిక్షతో పాటు, రూ 2,500 జరిమానా న్యాయమూర్తి విధించినట్లు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైనా, ఇతరులకు ప్రాణహాని కలిగించినా చర్యలు తీవ్రంగా ఉంటాయని సీఐ హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

పాలకుర్తి టౌన్: బాత్‌రూంలో స్నానం చేసేందుకు వెళ్లిన మహిళ విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని నారబోయినగూడెం చోటు చేసుకుంది. ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నారబోయినగూడెం గ్రామానికి చెందిన నాసం సుభద్ర(55) గురువారం బాత్‌రూంలో విద్యుదాఘాతంతో మృతి చెందింది. కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె



రఘునాథపల్లి: సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎంపీపీ, ఎంపీటీసీలు



కొడకండ్ల: వంటావార్పు చేస్తున్న కార్యదర్శులు



బచ్చన్నపేట: మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

రఘునాథపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. గురువారం సమ్మె 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వంటావార్పు, ముగ్గువేసి, మోకాళ్లపై నిల్చొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రొబేషనరీ కాలం పూర్తయిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఎంపీపీ మేకల వరలక్ష్మి, సీపీఎం నాయకులు ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు చేపట్టిన దీక్షను ఎంపీపీతో పాటు సీపీఎం నాయకులు, ఎంపీటీసీలు సందర్శించి మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు. ఎంపీటీసీలు రంగమ్మ, పేర్ని ఉష, బానోత్ భిక్షపతినాయక్, అల్లిబిల్లి కృష్ణ, రచ్చ సోమనాథ్, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మోకు కనకారెడ్డి, మండల కార్యదర్శి మహేందర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు, నాగరాజు ఉన్నారు.

వినూత్న నిరసన..

బచ్చన్నపేట: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలో వినూత్న నిరసన తెలిపారు. కార్యదర్శులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపి వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు ప్రశాంత్ ఆచార్య, మండల ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, కోశాధికారి సతీష్‌రెడ్డి, కార్యదర్శులు కర్ణాకర్ పాల్గొన్నారు.

వంటావార్పుతో..

కొడకండ్ల: తమను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో నివరధిక సమ్మె బాట పట్టిన జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు గురువారం ఏడో రోజు సమ్మెను కొనసాగించారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వం స్పందించి రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సోమేశ్, అభినవ్, బయ్యన్న, వంశీ, జ్యోతి, సందీప్, సంతోష్, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

ముగ్గేసి..

తరిగొప్పుల: పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్యదర్శులు వినూత్న నిరసన చేపట్టారు. సమ్మెలో భాగంగా ముగ్గులు వేసి నిరసన తెలిపారు. కార్యదర్శులు లింగం, మహేందర్, రాజేందర్, మమత, హరిత, కుమార్, కృష్ణ, రాజు, రాజశేఖర్, రఘు, మాధవి పాల్గొన్నారు.

చిల్పూరు: జేపీఎస్‌ల సమ్మెకు ఫత్తేపూర్ సర్పంచ్ రూప్లానాయక్ సంఘీభావం తెలిపి రూ. 2 వేల ఆర్థిక సాయం అందజేశారు. రంగారెడ్డి, పూల శ్రీకాంత్, తండ రాంబాబు ఉన్నారు.

దేవరుప్పుల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ డిక్లరేషన్ చేయాలని కోరుతూ శాంతియుత నిరవధిక దీక్ష గురువారం నాటికి 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి అమరేందర్ మాట్లాడారు. అనిల్ నాయక్, మహేష్ కుమార్, శ్వేత, నాగరాణి, ఫర్హానా, వాణిశ్రీ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పాలకుర్తి టౌన్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. కుమారస్వామి, శ్రీనివాస్, రఘు, కుమార్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



తరిగొప్పుల: ముగ్గు వేసి నిరసన తెలుపుతూ..



చిల్పూరు: ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్



దేవరుప్పులలో..

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పాలాభిషేకం చేసున్న ఫిరోజ్

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నదని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎండి. ఫిరోజ్ అన్నారు. గురువారం మండలంలోని పోచన్నపేటలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను సీఎం కేసీఆర్ దశల వారిగా గుర్తిస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే పారిశుద్ధ్య కార్మికుల జీతం నెలకు రూ.1,000 పెంచారని అన్నారు. కంసాని మహేందర్‌రెడ్డి, గూడ సిద్దారెడ్డి, మామిడి అయిలయ్య, జూకంటి కిష్టయ్య, నర్సింహులు, జూల చిన్న కృష్ణ, నరేందర్, బాలకృష్ణ, కిష్టయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మట్టి దందాపై తనిఖీ



అక్రమ మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు, పోలీసులు

రఘునాథపల్లి: మండలం కేంద్రంలోని దొడ్డిగుట్ట సమీపాన కొన్నాళ్లుగా కొందరు అక్రమ మార్గంలో మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయమై గ్రామానికి చెందిన గణేష్‌సింగ్ ఠాకూర్ ఇటీవల పోలీసులు, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు, మైనింగ్, ఫారెస్ట్ సిబ్బంది గురువారం తవ్వకాలు చేపట్టిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. మట్టిని ఎవరు తరలించారు..? వాహనాలు ఎవరివి..? అని కూపీ లాగుతున్నారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా అక్రమంగా మట్టితరలింపుపై వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టామని, మట్టి అక్రమంగా తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జాతీయ స్థాయిలో మండలానికి గుర్తింపు తేవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

కొడకండ్ల: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కార్యక్రమంలో మండలాన్ని ఆదర్శంగా నిలిపి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ జ్యోతి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఈ యజ్ఞంలో అందరం సమష్టిగా భాగస్వాములై స్వచ్ఛమైన గ్రామాలుగా తీర్చిదిద్దుకొందామని, కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రధాన కూడళ్లలో సామూహిక ఇంకుడుగుంతలు, టాయిలెట్స్ నిర్మాణం అవసరమైన చోట నిర్మాణం చేపట్టాలని, వైద్య సిబ్బంది ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీడీఓ సురేందర్‌నాయక్, ఎంపీఓ ఇందిర, ఏపీఓ కుమారస్వామి, సర్పంచ్‌లు మదుసూధన్, రాములు, సూపర్‌వైజర్ సరళ తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిబిరాన్ని వినియోగించుకోవాలి



క్రీడా శిక్షణ శిబిరంలో హెచ్‌ఎం, పీఈటీలు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత వేసవికాలంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఇప్పగూడెం జెడ్పీఎస్‌ఎస్‌లో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని హెచ్‌ఎం రఘుజీ అన్నారు. ఇప్పగూడెం జెడ్పీఎస్‌ఎస్‌లో పీఈటీ గిరెడ్డి ప్రమోద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి వాలీబాల్ శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు నెల రోజులు ఉంటాయని, ఉదయం, సాయంత్రం శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సీనియర్ వాలీబాల్‌క్రీడాకారులు శ్రీధర్, గణేష్, కె.నరేందర్, శ్రీకాంత్, అశోక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో శిక్షణ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని సెయింట్ ఆల్ఫోన్స్ పాఠశాలలో ఈ నెల 31వ తేదీ వరకు జిల్లా క్రీడలు, యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వాలీబాల్ శిక్షణను వినియోగించుకోవాలని శిక్షకుడు శాగ తిరుమలేష్ గురువారం తెలిపారు. మండలంలోని యువకులకు ఈ నెల 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేసిన జిల్లా క్రీడల అధికారి గోపాలరావుకు తిరుమలేష్ కృతజ్ఞతలు తెలిపారు. వాలీబాల్ క్రీడపై అసక్తి గల క్రీడాకారులు 8008088196 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

బాధ్యతల స్వీకరణ

కొడకండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వేల్పుగొండ ఇందిర మండల పంచాయతీ అధికారిగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. డీపీఓ ఆదేశాల మేరకు ఆమె ఎంపీఓగా అదనపు బాధ్యతలను స్వీకరించగా సమర్ధవంతంగా విధులు నిర్వర్తిస్తూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తూ మంచి ఖ్యాతిగడించాలని ఎంపీపీ జ్యోతి, ఎంపీడీఓ సురేందర్ నాయక్ సూచించారు.

ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష

పాలకుర్తి టౌన్: దళిత బంధు పథకంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేల అవినీతిని సీఎం కేసీఆర్ బయటపెట్టాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సోమశేఖర్, రాష్ట్ర నాయకులు చెరిపెల్లి యాదగిరిస్వామి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో బహుజన్‌ముక్తి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్‌పవార్ మాట్లాడుతూ దళితబంధు పథకంలో రూ.2లక్షల నుంచి 3లక్షలు తీసుకున్న ఎమ్మెల్యేల అవినితి చిట్ట బయట పెట్టాలని డిమాండ్‌చేశారు. దయాకర్, అకారపు సురేష్, కొత్తపల్లి అజయ్, యాకేష్, మారయ్య పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి



పాటలు పాడుతున్న కళాకారులు

లింగాలఘణపురం: మండల కేంద్రంలో గురువారం విద్యుత్ భద్రతా వారోత్సవాలపై జనగామ సాంస్కృతిక కళా బృందం ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలతో పాటు పొదుపుగా విద్యుత్‌ను వాడుకొని భావితరాలకు అందేవిధంగా చూడాలని ఆటపాటలతో ప్రదర్శనలు చేశారు. విద్యుత్ సిబ్బంది ఉదయ్‌కుమార్, బాలు, నర్సయ్య, కళాకారులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



పూజలో మారపాక రవి దంపతులు

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండలో నూతనంగా నిర్మించిన కనకదుర్గ ఆలయ విగ్రహ యంత్ర శిఖర ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన పూజలో జెడ్పీస్టాండింగ్ కమిటీ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి సతీసమేతంగా పాల్గొన్నారు. తాటికొండ గ్రామస్తుడైన ఆయన ముందుగా ఎల్లమ్మతల్లికి, అనంతరం కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందిన తాను అమ్మవారి దయతో క్షేమంగా ఉన్నానని తెలిపారు. కొత్తపల్లి సర్పంచ్ గోవిందు ఆనందం, తాటికొండ ఉపసర్పంచ్ మారపాక రాములు, వసంత్, శ్రీను, శ్రీధర్, సమ్మయ్య, బాబు, అనిల్, దేవదాసు, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు త్వరగా చేపట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యాన్ని త్వరితగతిన కొనుగోళ్లు చేపట్టి మిల్లులకు తరలించాలని సీపీఐ మండల కార్యదర్శి తోట రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తపల్లిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఐ నాయకులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రమేష్ రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా పాలకులకు పట్టడం లేదని విమర్శించారు. రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని, ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోళ్లు చేస్తూ మిల్లులకు తరలించాలని, తడిసిన ధాన్యాన్ని సరైన మద్దతు ధరతో కొనుగోళ్లు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు సముద్రాల రాజు, కోల రాజ్‌కుమార్, కొన్న సాయిలు ఉన్నారు.

భూగర్భ జలాల పెంపునకు దోహదం

కొడకండ్ల: చెరువు మరమ్మతుతో భూగర్భజలాలు పెరిగి రైతులకు ఎంతో ఉపయోగం చేకూరనుందని సర్పంచ్ జాజుల శ్రీలేఖ అన్నారు. గురువారం లోడి సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో చెరువు మరమ్మతు, కంపచెట్ల తొలగింపు పనులను సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. కట్టకు ఇరువైపులా చెట్ల తొలగింపుతో రైతులు బావుల వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు తీరుతాయని, ఇలాంటి రైతు ఉపయోగ పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ శౌరెడ్డి, ఆర్గనైజర్ బాకి శ్యామ్‌ప్రసాద్, లింగయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

సర్వమతాలకు సముచిత న్యాయం

దేవరుప్పుల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో సర్వమతాలకు సముచిత న్యాయం చేకూరుతుందని వైస్‌ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సింగరాజుపల్లిలో మంత్రి దయాకర్‌రావు ఎస్‌డీఎఫ్ కింద మంజూరైన రూ.5 లక్షలతో చర్చి ప్రహరీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాకనే బడులు, గుడులు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సర్పంచ్ మల్లేష్, ఉపసర్పంచ్ బుచ్చిరెడ్డి, నర్సింహ్మ, రవి, వీరయ్య ఉన్నారు.

రజక సంఘం ఎన్నిక

దేవరుప్పుల: మండల కేంద్రంలోని రజక సంఘం నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా భువనగిరి మల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవరుప్పుల సంఘ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా రెడ్డిరాజుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రెడ్డిరాజుల నర్సయ్య, కోశాధికారిగా ఐత ఉప్పలయ్య, సంయుక్త కార్యదర్శిగా రెడ్డిరాజుల చంద్రయ్య ఏన్నికయ్యారు. ఎభువనగిరి యాకస్వామి, రెడ్డిరాజుల రమేష్, ఎల్లప్ప, సాయికుమార్ ఉన్నారు.

కనులపండువగా హోమం



చండీహోమం నిర్వహిస్తున్న సర్పంచ్



హోమంలో పాల్గొన్న గౌడ కులస్తులు

రఘునాథపల్లి: మండల కేంద్రంలో విజయదుర్గాదేవి, ఎల్లమ్మ, పోచమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా గురువారం కనులపండువగా చండీహోమం నిర్వహించారు. సర్పంచ్ పోకల శివకుమార్ ఆధ్వర్యంలో నూతన విజయదుర్గాదేవి ఆలయం వద్ద వేద పండితుల మంత్రోచ్చారణాలతో చండీహోమంతో పాటు రుద్రహోమం, వాస్తు పర్యగ్నీకరణం నిర్వహించారు. సాయంత్రం దేవతామూర్తులకు నిర్వహించిన ధాన్యాధివాసం, ఫలాధివాసం, పుష్పాదివాసం, శయ్యాధివాసం, అవాహిత దేవతా ప్రదోషకాలపూజలకు మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో బియ్యం, పువ్వులతో పాల్గొని మొక్కుకున్నారు. శుక్రవారం ఉదయం నూతనంగా నిర్మించిన ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠంచనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఉప సర్పంచ్ రాములు, నిర్వాహణ కమిటీ సభ్యులు పోరెడ్డి రాఘవరెడ్డి, నాగేష్, వెంకటయ్య, శ్రీహరి, మర్కాల వెంకట్‌రెడ్డి, రాములు, బిర్రు మధు, ప్రభాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇప్పగూడెంలో హోమం

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న గౌడ కులస్తుల ఆరాధ్యదైవమైన శ్రీ కంఠమహేశ్వరస్వామి–సురమాంబదేవి, రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని మహర్షి విగ్రహ ప్రతి ష్ఠాపన, కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం హోమం పూజలను నిర్వహించారు. కల్యాణ ఉత్సవ కమిటీ చైర్మన్ మందపురం ఎల్లగౌడ్, గౌరవ అధ్యక్షురాలు, ఎంపీటీసీ విజయలక్ష్మి, యాకయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం వెంటనే కొనాలి

జఫర్‌గఢ్: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి బాధిత రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాలు, కల్లాల వద్ద ఆరబోసిన, నిల్వ చేసిన ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కొన్ని చోట్ల వరద తాకిడికి ధాన్యం కొట్టుకపోవడంతోపాటు ఈదురు గాలులకు కోతకు వచ్చిన మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు అపార నష్టం వాటిల్లిందని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంతో రైతులు రోజుల తరబడి ఐకేపీ కేంద్రాలు, కల్లాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తున్నదని, తక్షణమే ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడంతోపాటు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. లేని పక్షంలో రైతులతో కలసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘం నాయకులు నక్క యాకయ్య, పిన్నింటి సమ్మయ్య, బుల్లె కృష్ణ, శాగ యాదగిరి, వేల్పుల చిన్న రాములు, నీరటి కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

హైవేపై అడ్డదారి..!

- డివైడర్‌ను ధ్వంసం చేసి రోడ్డు దాటుతున్న వాహనదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



నెల్లుట్ల బైపాస్ వద్ద ధ్వంసం చేసిన డివైడర్ నుంచి రోడ్డుదాటుతున్న ద్విచక్రవాహనదారులు

లింగాలఘణపురం: హైవేపై అడ్డదారిలో రోడ్డు దాటుతున్నారు.. ఇలా రోడ్డు దాటే వారి ప్రాణాలకు ఎవరు హామీ ఇస్తారో తెలియడంలేదు. నేషనల్ హైవేపై ఉన్న డివైడర్‌ను ధ్వంసం చేసి దర్జాగా ద్విచక్రవాహనదారులు దాటుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై నెల్లుట్ల బైపాస్ వద్ద ద్విచక్ర వాహనదారులు డివైడర్‌ను కొద్దిగా ధ్వంసం చేసి రోడ్డు దాటుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరిగి ఎవరి ప్రాణాలు పోతాయో తెలియడంలేదు. హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిలో జనగామ నుంచి సూర్యాపేట వైపు వెళ్లేందుకు బ్రిడ్జిపై నుంచి వెళ్లాల్సి ఉంటుంది. అదే విధంగా సూర్యాపేట నుంచి వరంగల్ వైపునకు బ్రిడ్జిపై నుంచి దిగి సర్వీసు రోడ్డు మీదుగా వెళ్లాలి. అంతేకాకుండా హైదరాబాద్ నుంచి సూర్యాపేట వైపు వాహనదారులు సర్వీసు రోడ్డు నుంచి బ్రిడ్జి ఎక్కి వెళ్లాల్సి ఉంటుంది. ఇదంతా ఎవరు తిరిగి వెళ్తారని హైవేపైనున్న డివైడర్‌ను రెండు వైపులా కొద్దిగా ధ్వంసం చేసి ద్విచక్రవాహనదారులు అడ్డదారి ఏర్పాటు చేసుకొని వెళ్తున్నారు. ఇలా రోడ్డు దాటే సమయంలో హైవేపై అతివేగంగా వచ్చే వాహనాలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడంలేదు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు కాని, పోలీసులు గాని డివైడర్‌ను ధ్వంసం చేసిన వారిపై గాని, అడ్డగోలుగా దాటుతున్న వారిపై చర్యలు తీసుకోవడంలేదు. అసలే హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ప్రమాదాలు జరిగిన తరువాత స్పందించడం కంటే జరుగకుండా ముందస్తుగా చర్యలు తీసుకొంటే బాగుంటుందని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

సదరం క్యాంపు ఏర్పాటు చేయాలి

జఫర్‌గఢ్: దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం వెంటనే సదరం క్యాంపును ఏర్పాటు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల ఎలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కొత్తగా దివ్యాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సదరం క్యాంపు ద్వారా సర్టిఫికెట్ మంజూరు చేయడం లేదన్నారు. సంఘం నాయకులు గంగాదరి యాదగిరి, చీపురి రాజమ్మ, సురేష్, కృష్ణ, జైపాల్‌రెడ్డి, మైసయ్య పాల్గొన్నారు.